క్లుప్తంగా

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

బిక్కవోలు: మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ రాజమహేంద్రవరం ఇన్‌చార్జి ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జేవీవీ నటరాజన్ ఒక ప్రకటనలో తెలిపారు. బిక్కవోలు, పందలపాక 11 కేవీ సబ్‌స్టేషన్ వార్షిక మరమ్మతుల కోసం శుక్రవారం ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు అంతరాయం ఉంటుందన్నారు. బిక్కవోలు, ఊలపల్లి, కొంకుదురు, మెళ్లూరు, ఆరికరేవుల, బలభద్రపురం గ్రామాల్లోను, అగ్రికల్చర్ బోర్లకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తారని తెలిపారు.

షిర్డీ సాయికి ప్రత్యేక పూజలు


పెద రాయవరంలో షిర్డీ సాయిబాబా

రంగంపేట: పెద రాయవరం గ్రామంలో కొలువైన షిర్డీ సాయిబాబా మందిరంలో గురువారం స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. తెల్లవారుజామున బాబాను ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై, బాబాను దర్శించుకున్నారు. మొక్కులు చెల్లించి, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

గ్రామాల్లో పారిశుధ్య చర్యలు


మర్రిపూడిలోని డ్రైన్‌లో పూడిక తొలగిస్తున్న కార్మికుడు

రంగంపేట: వాతావరణ మార్పులతో గ్రామాల్లో పారిశుధ్య సమస్య తీవ్రరూపం దాల్చింది. ఇటీవల కురిసిన వర్షాలతో పరిస్థితి మరింత అధ్వానంగా మారింది. కచ్చా డ్రైన్లు లేనిచోట మురుగు రోడ్లపై ప్రవహిస్తోంది. మురుగునీటి నిల్వల కారణంగా దోమలు వృద్ధి చెంది, ప్రజలకు కంటిపై కునుకు లేకుండా చేస్తున్నాయి. దీంతో ఆయా గ్రామాల సర్పంచ్‌లు పారిశుధ్య సమస్యపై దృష్టి సారించారు. మండలంలోని పలు గ్రామాల్లో అధికారులు తాత్కాలికంగా కచ్చా డ్రైన్లు ఏర్పాటు చేస్తున్నారు. సీసీ డ్రైన్లలో పూడికతీత కార్యక్రమాలు సాగుతున్నాయి. డ్రైన్లలో ప్లాస్టిక్ వ్యర్థాలను కార్మికులు తొలగిస్తున్నారు. డ్రైన్లకు, రోడ్లకు ఇరువైపులా బ్లీచింగ్ చల్లిస్తున్నారు. మండలంలోని మర్రిపూడి, పెదరాయవరం, చంద్రేడు, రంగంపేట తదితర గ్రామాల్లో పారిశుధ్య పనులు సాగుతున్నాయి. ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పర్యవేక్షిస్తున్నారు.

బ్యాంకు ఖాతాలు సరి చేసుకోవాలి


సీతానగరం: మండలంలోని రైతులు స్తంభించిన తమ బ్యాంకు ఖాతాలను సరి చేసుకోవాలని తహసీల్దార్ ఎ.శ్రీనివాస్ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, మండలంలో రైతుల ఖాతాలో పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ పథకాల నగదు శనివారం నుంచి జమ అవుతాయన్నారు. మండలంలో సుమారు 160 మంది రైతులు తమ ఖాతాలను సరి చేసుకోవాల్సి ఉందన్నారు. అలాగే ఎన్‌పీసీఐ మ్యాపింగ్ చేయించుకుని, ఆయా గ్రామాల్లోని వీఏఏలకు, వీఆర్వోలకు తెలియపర్చాలని సూచించారు.

యూనివర్సిటీ అధ్యాపకురాలి ఉద్యోగ విరమణ


డాక్టర్ లక్ష్మీనరసమ్మను సన్మానిస్తున్న సహచరులు

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీలో తెలుగు అధ్యాపకురాలిగా డాక్టర్ డి.లక్ష్మీనరసమ్మ విశిష్ట సేవలు అందించారని యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య కేవీ స్వామి కొనియాడారు. 14 ఏళ్ల పాటు తెలుగు అధ్యాపకురాలిగా విధులు నిర్వహించి, ఉద్యోగ విరమణ చేసిన ఆమెను గురువారం దుశ్శాలువాతో ఘనంగా సన్మానించారు. పలువురు సహచరులు జ్ఞాపికలను అందజేశారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి


విద్యార్థులకు అవగాహన కలిగిస్తున్న పోలీసులు

రాజానగరం: అభివృద్ధి చెందుతున్న సాంకేతిక పరిజ్ఞానంతో కొంతమంది స్వార్థపరులు మోసాలకు పాల్పడుతున్నారని, అటువంటి వారితో అప్రమత్తంగా ఉండాలని స్థానిక ఎస్సైలు కేవీ నాగార్జున, పి.నారాయణమ్మ విద్యార్థులకు సూచించారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో నార్త్ జోన్ శక్తి టీమ్ ఆధ్వర్యంలో గురువారం అవగాహన కార్యక్రమం జరిగింది. శక్తి యాప్, సైబర్ క్రైమ్, డ్రగ్స్, పోక్సో యాక్ట్, గుడ్ టచ్–బ్యాడ్ టచ్ తదితర అంశాలపై అవగాహన కలిగించారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నిబంధనాలు

- కొత్త రేషన్‌కార్డుల కోసం ఆశగా ఎదురుచూస్తున్న అర్హులు
- చుక్కలు చూపిస్తున్న ప్రభుత్వ యంత్రాంగం
- మార్పులు, చేర్పులకు నో ఆప్షన్
- కొత్త జంటలకు తప్పని తిప్పలు

నియోజకవర్గంలో ఇలా..

మండలం	రేషన్ కార్డులు
అనపర్తి	23,175
బిక్కవోలు	23,146
రంగంపేట	20,323
పెదపూడి	23,932
మొత్తం	90,576


రంగాపురంలో రేషన్ షాపు వద్ద లబ్ధిదారులు (ఫైల్)

బిక్కవోలు: సార్వత్రిక ఎన్నికలకు ముందు అర్హులందరికీ కొత్త రేషన్ కార్డులు ఇస్తామని హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం.. ఇప్పుడు దరఖాస్తుదారులకు కఠిన నిబంధనలతో గట్టి షాక్ ఇస్తోంది. కొత్త కార్డులు వస్తాయన్న ఆశతో సచివాలయాలకు పరుగులు తీస్తున్నా.. అక్కడి నిబంధనలు చూసి వేలాది మందికి నిరాశే ఎదురవుతోంది. దరఖాస్తు ప్రక్రియలో ఎదురవుతున్న అడ్డంకులు, సాఫ్ట్‌వేర్ సమస్యలతో అర్హులు సైతం అనర్హులుగా మిగిలిపోయే పరిస్థితి నెలకొంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది తర్వాత కొత్త కార్డుల దరఖాస్తుకు అవకాశం కల్పించింది. ప్రభుత్వం విధించిన పలు నిబంధనలు దరఖాస్తుదారులకు చుక్కలు చూపిస్తున్నాయి. కార్డులో తల్లిదండ్రులు, కుమారుడు ఉండి, కుమారుడికి వివాహమైతే కొత్త కార్డుకు దరఖాస్తు చేసుకోవడానికి వీలు లేదు. కుమారుడిని ప్రస్తుత కార్డు నుంచి తొలగించడం లేదా కుమారుడు, కోడలి పేరిట కొత్త కార్డు ఇవ్వడానికి నిబంధనలు అడ్డుపడుతున్నాయి. పేరు తొలగింపు, చేర్పులకు సాఫ్ట్‌వేర్‌లో ఆప్షన్ లేదు. ఇదే పరిస్థితి వివాహమైన కుమార్తెల విషయంలోనూ ఉంది. దీంతో కొత్త జంటలు కార్డులు పొందలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయి.

నిలిచిపోతున్న పథకాలు

కార్డులోని కుమారుడు లేదా కుమార్తెకు ప్రభుత్వం ఉద్యోగం వస్తే.. ఆ కుటుంబంలో ఎవరికీ ప్రభుత్వ పథకాలు వర్తించడం లేదు. తల్లిదండ్రులకు పింఛన్లు, ఇతర పథకాలు కూడా నిలిచిపోతున్నాయి. ఇది వారి జీవనంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. కొత్త రేషన్ కార్డు కోసం కరెంటు బిల్లు తప్పనిసరి చేశారు. ఎప్పుడైనా పొరపాటున అధిక బిల్లు వచ్చిన వారి దరఖాస్తును తిరస్కరిస్తున్నారు. ఆ బిల్లును విద్యుత్ కార్యాలయంలో సరిచేయించుకుని వచ్చే వరకు దరఖాస్తుకు అవకాశం లేకుండా పోతోంది. భార్యాభర్తల ఆధార్ కార్డుల్లో వేర్వేరు చిరునామాలు ఉంటే, వారి దరఖాస్తు ముందుకు సాగడం లేదు. ఇద్దరి చిరునామాలను ఒకే ప్రాంతానికి మ్యాపింగ్ చేస్తేనే కార్డుకు దరఖాస్తు చేసుకునే వీలు కలుగుతుంది.

సర్వర్ సమస్యలు

కఠిన నిబంధనలకు తోడు, సర్వర్ సమస్యలు దరఖాస్తుదారులకు తలనొప్పిగా మారాయి. గంటల తరబడి వేచి ఉన్నా సర్వర్ డౌన్ లేదా ఈ ఆప్షన్ లేదనే సమాధానమే సచివాలయం సిబ్బంది నుంచి వస్తోంది. దరఖాస్తుదారులను కలెక్టరేట్‌లోని సివిల్ సప్లయిస్ కార్యాలయానికి పంపుతున్నారు. అక్కడికి వెళ్తే తిరిగి సచివాలయంలోనే నమోదు చేసుకోవాలని చెప్పడంతో.. ప్రజలు అటూ ఇటూ తిరుగుతూ తీవ్ర అసహనానికి గురవుతున్నారు. రాష్ట్ర పౌర సరఫరాల శాఖ ఈ నెల 25 నుంచి కొత్త కార్డులు ఇస్తామని ప్రకటించినప్పటికీ, ప్రస్తుత పరిస్థితులు చూస్తే అది ఎంతవరకు సాధ్యమనే దానిపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వం తక్షణం స్పందించి, ఈ అడ్డగోలు నిబంధనలను సడలించి, సాఫ్ట్‌వేర్‌లో అవసరమైన మార్పులు చేస్తేనే కొత్త కార్డుల జారీకి సాధ్యమవుతుంది. లేకపోతే పేదల ఆశలు అడియాసలుగానే మిగిలిపోతాయని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

హామీలతో సరి!

అధికారం కోసం ఎన్నికల ముందు అనేక హామీలు గుప్పించిన కూటమి నాయకులు.. తీరా అధికారంలోకి వచ్చాక మాత్రం వాటిని పట్టించుకోవడం లేదు. రేషన్ కార్డులు అనేక సంక్షేమ పథకాల అమలుకు ఆధారం. కార్డుల మంజూరు చేయడంలో కూటమి ప్రభుత్వం ఇంత జాప్యం చేస్తుండటంపై ప్రజలు మండిపడుతున్నారు.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో..

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో రేషన్ కార్డుల మంజూరు పారదర్శకంగా జరిగేది. అర్హులైన ప్రజలు సచివాలయం వద్దకు వెళ్లి దరఖాస్తు చేసుకుంటే వెంటనే కార్డులు మంజూరయ్యేవి. కొన్ని సందర్భాల్లో గంటల వ్యవధిలో కూడా కార్డులు మంజూరు చేశారు. కార్డుల్లో కొత్తగా సభ్యులను చేర్చుకోవాలన్నా, తొలగించాలన్నా సచివాలయ పని దినాల్లో ప్రభుత్వ వెబ్‌సైట్లు ఎప్పుడూ అందుబాటులో ఉండేవి. వలంటీర్లు ఇంటింటికీ తిరిగి, వారే స్వయంగా దరఖాస్తు చేసి, కార్డు మంజూరైతే ఇంటికి తీసుకొచ్చి లబ్ధిదారులకు అందజేసేవారు. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. సార్వత్రిక ఎన్నికలకు షెడ్యూల్ విడుదల చేసినప్పటి నుంచి వెబ్‌సైట్లన్నీ మూసేశారు. ఇదేమి పాలన అని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

ఎప్పుడు మంజూరు చేస్తారో?



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 14 నెలలు పూర్తవుతుంది. ఇప్పటి వరకు కొత్త కార్డుల ఊసే లేదు. ఇప్పటికైనా పాలకులు స్పందించి కొత్త కార్డుల మంజూరుకు మార్గదర్శకాలు జారీ చేయాలి.

– బొడ్డు ముత్యాలరావు, పందలపాక

కార్డుల కోసం ఎదురుచూపులు



గత ప్రభుత్వ హయాంలో గంటల వ్యవధిలో రేషన్ కార్డులు వచ్చేవి. వలంటీర్లు ఇంటింటికీ వచ్చి కార్డుల కోసం దరఖాస్తులు చేయించేవారు. ప్రస్తుతం కార్డులు సకాలంలో అందక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామాల్లో వందలాది మంది కొత్త కార్డుల కోసం, సవరణల కోసం ఎదురుచూస్తున్నారు.

– పోతుల ప్రసాద్‌రెడ్డి, మాజీ సర్పంచ్, ఊలపల్లి

కూటమి ప్రభుత్వ అప్రకటిత ఎమర్జెన్సీ

మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి



అనపర్తి: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అప్రకటిత ఎమర్జెన్సీని అమలు చేస్తుందని అనపర్తి మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నియోజక వర్గ సమన్వయకర్త డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి ధ్వజమెత్తారు. గురువారం ఆయన అనపర్తి పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అడుగు తీసి బయటపెడితే కూటమి ప్రభుత్వంలో ఆందోళన ప్రారంభమవుతుందన్నారు. ఆయన సభలకు పోటెత్తుతున్న జన సునామీని చూసి కూటమి పెద్దలకు నిద్ర పట్టడం లేదన్నారు. గురువారం మాజీ మంత్రి కాకాని గోవర్ధనరెడ్డి, కోవూరు ఎమ్మెల్యే నల్లపురెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డితో పాటు, పలువురిని పరామర్శించేందుకు జగన్‌మోహన్‌రెడ్డి నెల్లూరు వస్తుంటే, పట్టణంలోకి ప్రవేశించే రోడ్లను పొక్లెయిన్లతో కందకాలు చేసి, పట్టణం చుట్టూ ఇనుప కంచెలు వేసి, వేలాది పోలీసులతో మోహరించి, ఇంకా చాలదన్నట్టు ప్రైవేటు సైన్యాలను కూడా దింపి ప్రజలను నిలువరించాలని చేసిన ప్రయత్నం విఫలమైందన్నారు. నిరంకుశ పోకడలకు పోతున్న ప్రభుత్వానికి గడ్డు రోజులు సమీపించాయన్నారు. ఇప్పటివరకు జరిగిన పర్యటనలు ఒక ఎత్తయితే, నెల్లూరు పర్యటన మరో ఎత్తు అన్నారు. కఠిన ఆంక్షల నడుమ జరిగిన నెల్లూరు పర్యటనలో జగన్‌మోహన్‌రెడ్డికి వస్తున్న ప్రజాదరణను చూసైనా కూటమి నాయకులు నిరంకుశ పోకడలకు స్వస్తి చెప్పాలని హితవు పలికారు.

మల్లికార్జునరావు సేవలు అభినందనీయం

కోరుకొండ: వ్యవసాయాధికారి మల్లికార్జునరావు సేవలు అభినందనీయమని వ్యవసాయ శాఖ జిల్లా అధికారి మాధవరావు కొనియాడారు. గురువారం కోరుకొండ వ్యవసాయ శాఖ ఏడీ బిళ్లకోట మల్లికార్జునరావు ఉద్యోగ విరమణ సభకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మంచి నైపుణ్యం, మానవీయతకు మల్లికార్జునరావు నిదర్శనీయమన్నారు. ఈ సందర్భంగా మల్లికార్జునరావును శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో అనపర్తి ఏడీ డీవీ కృష్ణ, నిడదవోలు ఏడీ బీవీఎస్ ప్రసాద్, ఏడీ జయరామలక్ష్మి, ఆత్మ అధికారి బి.రాజశేఖర్, వ్యవసాయాధికారులు రామతులసీ, గౌరీదేవి, సూర్యరమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రేమ్‌చంద్ జయంతి

ప్రకాశం నగర్: ఆర్ట్స్ కళాశాల హిందీ విభాగం ఆధ్వర్యంలో గురువారం మున్షి ప్రేమ్‌చంద్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఆర్కే రామచంద్ర ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రేమ్‌చంద్ చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. ప్రేమ్‌చంద్ గద్యంలో కథలు, నవలలు రచించి, మానవాళి మనుగడకు కావాల్సిన ఉత్తేజాన్ని నింపారని కొనియాడారు.

ఎమర్జెన్సీని తలపిస్తున్న కూటమి పాలన

- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి వేణుగోపాలకృష్ణ
- బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమంపై సన్నాహక సమావేశం


క్యూ ఆర్ కోడ్‌ను చూపుతున్న వేణు, రాజా, విజయలక్ష్మి తదితరులు

కోరుకొండ: రాష్ట్రంలో కూటమి పాలన ఎమర్జెన్సీని తలపిస్తోందని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ తీవ్రంగా విమర్శించారు. గురువారం కోరుకొండలోని పార్టీ కార్యాలయంలో బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమంపై సన్నాహక సమావేశం జరిగింది. ముఖ్య అతిథి వేణుగోపాలకృష్ణ మాట్లాడుతూ, ఎన్నికల సందర్భంగా ప్రజలకిచ్చిన హామీలను అమలు జరపకపోతే శిక్షించే చట్టాలు ఇక్కడ లేవని చంద్రబాబు కనిపెట్టారని ఎద్దేవా చేశారు. హామీలను అమలు చేయకుండా డైవర్షన్ రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాలు పేరిట హామీలన్నింటినీ అమలు చేశారని గుర్తుచేశారు. హామీల అమలుపై ప్రజలకు బాండ్లు రాసిచ్చిన సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ నిస్సిగ్గుగా ప్రతిపక్ష నాయకులు, కార్యకర్తలను కేసులు, అరెస్టులతో వేధిస్తున్నారని మండిపడ్డారు. సినిమాల పేరుతో పవన్ తిరుగుతుంటే, సింగపూర్ టూర్లకు చంద్రబాబు వెళ్తున్నారని దుయ్యబట్టారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2.0 ప్రకారం కార్యకర్తలకు సంపూర్ణ రక్షణ అందిస్తారన్నారు. రాష్ట్రంలో మహిళలు, దళితులు, ప్రతిపక్షానికి చెందిన వారిపై జరుగుతున్న దాడులు, అన్యాయాలను పార్టీ కార్యకర్తలు ప్రజలకు తెలియజేయాలన్నారు. స్మార్ట్ ఫోన్‌ను ఆయుధంగా చేసుకుని, కార్యకర్తలంతా సైనికుల్లా పనిచేయాలన్నారు. వచ్చే ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పనిచేయాలన్నారు.

నమ్మకాన్ని సాధించాలి

పార్టీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా మాట్లాడుతూ, సమాజంలోని అన్ని సామాజిక వర్గాలకు చెందిన వారి నమ్మకాన్ని పార్టీ కార్యకర్తలు సంపాదించుకోవాలన్నారు. గ్రామాల్లో ప్రతిఒక్కరినీ కలిసి, వారి కష్టసుఖాలను తెలుసుకోవాలన్నారు. పార్టీని వీడిన వారిని కలుపుకోవడానికి కృషి చేయాలన్నారు. పార్టీ ప్రతిపక్షంలో ఉండగా అండగా నిలిచిన వారికి శ్రేణులకు గుండెల్లో స్థానమిస్తానన్నారు. ప్రజా సమస్యలపై ప్రచారం, కూటమి అన్యాయాలను ఎండగట్టడంలో సోషల్ మీడియా బలోపేతం కావాల్సి ఉందన్నారు. గ్రామాల్లో అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నాయని, గంజాయి వ్యాపారం, బెల్టు షాపులతో మద్యం ఏరులై పారుతోందన్నారు. నియోజకవర్గంలో చట్ట వ్యతిరేక కార్యకలాపాలను ప్రోత్సహిస్తూ స్థానిక ప్రజాప్రతినిధి అక్రమార్జనకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ప్రజలే ఆస్తిగా, కార్యకర్తలే బంధువులుగా జక్కంపూడి కుటుంబం పనిచేస్తుందన్నారు. పార్టీ పీఏసీ నాయకురాలు జక్కంపూడి విజయలక్ష్మి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో క్యూ ఆర్ కోడ్‌ను విడుదల చేశారు. జెడ్పీటీసీ సభ్యుడు కర్రి నాగేశ్వరరావు, మాజీ ఏఎంసీ సభ్యుడు నక్కా రాంబాబు, పార్టీ మహిళా నాయకురాలు కొల్లం రాజా రమాదేవి, నాయకులు కల్యాణం రాంబాబు, కంటే వినయ్‌తేజ, కడియాల పాపారావు, కొండపల్లి దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య సమాజానికి పరిశుభ్రత కీలకం


ఏపీత్రయంలో తడి, పొడి చెత్త సేకరణపై అధికారులతో మాట్లాడుతున్న డీపీఓ

కాకినాడ జిల్లా పంచాయతీ అధికారి రవికుమార్

పెదపూడి: ఆరోగ్యవంత సమాజ నిర్మాణానికి పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలని కాకినాడ జిల్లా పంచాయతీ అధికారి రవికుమార్ అన్నారు. ఏపీత్రయం పంచాయతీలో గురువారం ఆయన పారిశుధ్య పనులను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా క్లాప్ మిత్రాలు ఏ విధంగా తడి, పొడి చెత్త సేకరిస్తున్నారో పరిశీలించారు. అలాగే ప్రజలు ఏవిధంగా తడి, పొడి చెత్తను భద్రపరిచి క్లాప్ మిత్రాలకు ఇస్తున్నారనే దానిపై ప్రజలతో మాట్లాడారు. గ్రామాల్లో పారిశుధ్య చర్యలు మరింత మెరుగుపర్చి ప్రజారోగ్యాన్ని పరిరక్షించడానికి అధికారులు, ప్రజాప్రతినిధులు కృషి చేయాలన్నారు. తడి, పొడి చెత్త క్లాప్ మిత్రాలకు అందించే విధానంపై ప్రజల్లో చైతన్యం పెంచాలన్నారు. తాగునీటి రక్షిత పథకాన్ని సందర్శించి, క్లోరినేషన్ ఎలా చేస్తున్నారో పరిశీలించారు, అధికారులకు పలు సూచనలు ఇచ్చారు. డిప్యూటీ ఎంపీడీఓ మేడపాటి సత్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో శానిటేషన్ క్లాప్ మిత్రాలు తడి, పొడిచెత్తపై గృహిణులతో చేస్తున్న ఐఈసీ యాక్టివిటీని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట సచివాలయ కార్యదర్శి కొమ్మన తరుణ్, ఇతర సిబ్బంది ఉన్నారు.

సేవలతోనే మంచి గుర్తింపు


కృపాబాయమ్మను సన్మానిస్తున్న వైద్యులు, సిబ్బంది

రాజానగరం: ఉద్యోగం ఏదైనా విధుల నిర్వహణలో అందించిన సేవలే మంచి గుర్తింపునిస్తాయని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ జి.రామభాస్కర్ అన్నారు. పీహెచ్‌సీలో నాలుగు దశాబ్దాల పాటు వైద్య సేవలందించి, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్‌గా ఉద్యోగ విరమణ చేసిన సీహెచ్ కృపాబాయమ్మకు గురువారం ఘనంగా వీడ్కోలు పలికారు. పీహెచ్‌సీ సిబ్బంది ఆధ్వర్యంలో ఆమెను దుశ్శాలువాతో సన్మానించి, జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ డి.వెంకటలక్ష్మి, డాక్టర్ ఉదయాంజిల్, సిబ్బంది పాల్గొన్నారు.

మహాలక్ష్మి అమ్మవారికి వెండి శఠగోపం సమర్పణ


శఠగోపాన్ని అందుకుంటున్న పీఠాధిపతి వెంకన్నబాబు తదితరులు

సీటీఆర్ఐ: గాడాలలో ఉన్న మహాలక్ష్మి అమ్మవారికి ప్రముఖ రియల్ ఎస్టేట్ వ్యాపారవేత్త కొండమీద దుర్గారావు, రత్నం దంపతులు, వారి కుమారుడు శ్రీను 206 గ్రాముల వెండి శఠగోపాన్ని సమర్పించారు. గురువారం స్థానిక దేవీచౌక్‌లోని ట్రస్ట్ కార్యాలయంలో శ్రీమహాలక్ష్మి సమేత వేంకటేశ్వర స్వామి పీఠాధిపతి చిన్నవెంకన్నబాబుకు దీనిని అందజేశారు. ఈ సందర్భంగా పీఠాధిపతి చిన్నవెంకన్నబాబు మాట్లాడుతూ, శఠగోపం సాధారణంగా రాగి, కంచు, వెండితో తయారు చేయబడుతుందని, పైభాగంలో విష్ణు పాదాలు ఉంటాయన్నారు. దేవాలయంలో దర్శనం అనంతరం తీర్థం, శఠగోపం తీసుకోవడం ఆనవాయితీ అన్నారు. ఈ కార్యక్రమంలో మాతాజీ దుర్గా వెంకట హేమావతి,, ద్వారక తిరుమల మాజీ బోర్డ్ మెంబర్ కొత్త విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో సర్వేతో హక్కుల నిర్ధారణ


శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్న అధికారులు

సీతానగరం: స్వమిత్వ స్కీమ్ ద్వారా గ్రామాల్లో మెరుగైన సాంకేతికతతో కూడిన సర్వేతో హక్కులు నిర్ధారించనున్నట్టు నోడల్ ఆఫీసర్, ఇన్‌చార్జి ఎంపీడీఓ కేవీఎస్ఎస్ మూర్తి తెలిపారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్, డిజిటల్ అసిస్టెంట్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ సర్వేతో పంచాయతీలకు సంబంధించిన ఆస్తుల విషయంలో స్పష్టత రానుందన్నారు. మండలంలోని రఘుదేవపురం, చినకొండేపూడి, మునికూడలి, వెదుళ్లపల్లి, రాపాక, నాగంపల్లి, చీపురుపల్లి, ములకల్లంక, కాటవరం, మిర్తిపాడుల్లో స్వమిత్వ సర్వే నిర్వహిస్తున్నట్టు వివరించారు. మండలంలోని వివిధ గ్రామాల్లో భవనాలు, రోడ్లు, కాలువలు, ఖాళీ స్థలాలను సర్వేలో గుర్తించి, హక్కులు నిర్ధారించనున్నారని తెలిపారు. డ్రోన్ల ద్వారా గ్రామాల్లో సర్వే నిర్వహిస్తారన్నారు. తొలుత రెవెన్యూ, సర్వే యంత్రాంగం ఆయా గ్రామాల్లో హద్దులు గుర్తిస్తుందన్నారు. అనంతరం చెరువులు, పాఠశాలలు, రహదారులు, పార్కులు, దేవాలయాలు, అంగన్‌వాడీలు, ఆరోగ్య కేంద్రాలు తదితర వాటిని సర్వే చేస్తారన్నారు. తద్వారా ప్రభుత్వ ఆస్తులపై పూర్తి స్పష్టత వస్తుందన్నారు. ఆ తర్వాత ప్రజల గృహాలకు హద్దులు నిర్ణయిస్తారన్నారు. అనంతరం యాజమాన్య హక్కు పత్రాలను అందిస్తారన్నారు. వాటితో అమ్మకాలు, కొనుగోలు, బ్యాంక్ రుణాలు పొందడం సులభతరం అవుతాయని వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఓ సుబ్రహ్మణ్యం, సీనియర్ అసిస్టెంట్ సీహెచ్ గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

తపస్యధామ్ ఆశ్రమంలో రక్షా బంధన్


బ్రహ్మకుమారికి రక్షా బంధన్ కడుతున్న రజని

అనపర్తి: రక్షా బంధన్ అనేది సోదరుల మధ్య మాత్రమే కాకుండా, ఆధ్యాత్మిక దృక్పథంతో దేవునితో ఉన్న శాశ్వత సంబంధానికి చిహ్నమని బ్రహ్మకుమారీస్ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ఇన్‌చార్జి బీకే రజని అన్నారు. అనపర్తి బ్రహ్మకుమారీస్ తపస్యధామ్ ఆశ్రమంలో గురువారం రక్షా బంధన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రజనీ మాట్లాడుతూ మానవుల అసలు స్వభావమైన శాంతి, ప్రేమ, స్వచ్ఛత, జ్ఞానం, దయతో ఉండటానికి ప్రతిజ్ఞ చేయాలన్నారు. తద్వారా ప్రతి ఆలోచన, మాట, చర్య ఉన్నతమైనవిగా, దివ్యమైనవిగా ఉంటాయన్నారు. బ్రహ్మ బాబా మురళీ పాఠాలు దైవిక జ్ఞానాన్ని ప్రసాదించి, అపరిమితమైన శాంతిని, ఆనందాన్ని కలుగచేస్తాయన్నారు. రాఖీ కట్టేటప్పుడు వ్యర్థ ఆలోచనలు, మాటలు త్యజించాలన్నారు. బంధాన్ని ఉన్నతమైనదిగా మార్చేలా ఆలోచనలు ఉండాలని సూచించారు. అనంతరం రాఖీ ధారణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక కేంద్ర నిర్వాహకురాలు బీకే సుశీల, దేవారెడ్డి, సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఈ–క్రాప్ నమోదు చేయించాలి


కరకుదురులో ఈ–క్రాప్ నమోదును పరిశీలిస్తున్న ఏఓ సత్యప్రసాద్

పెదపూడి: రైతులు ఈ–క్రాప్ నమోదు ప్రక్రియను సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి ఎస్.సత్యప్రసాద్ తెలిపారు. కరకుదురులో గురువారం ఈ–క్రాప్ నమోదు ప్రక్రియను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రైతు సాగు చేస్తున్న పంట, సాగు విస్తీర్ణ వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. ఈ సందర్భంగా సత్యప్రసాద్ మాట్లాడుతూ, మండలంలో 18,150 ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారన్నారు. దానిలో 17,450 ఎకరాల్లో వరి వెదసాగు, వరినాట్లు విధానంలో సాగు పూర్తి చేశారన్నారు. ధాన్యం కొనుగోలు చేయడానికి, పంట నష్ట పరిహారం పొందడానికి ఈ–క్రాప్ నమోదు ఉపయోగపడుతుందన్నారు. గ్రామాల్లో రైతు సేవా కేంద్రానికి వెళ్లి రైతులు సాగు చేస్తున్న వివరాలు గ్రామ వ్యవసాయ సహాయకులకు అందించి ఈ–క్రాప్ నమోదు చేయించుకోవాలన్నారు.

4 నుంచి హోమియో వైద్య శిక్షణ

ప్రకాశం నగర్: జగద్గురు పీఠం ఆధ్వర్యంలో స్థానిక గౌతమ ఘాట్‌లో ఈ నెల నాలుగో తేదీన హోమియో ప్రాథమిక వైద్య శిక్షణ తరగతులు ప్రారంభం కానున్నాయని పీఠం నిర్వాహకులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి ఆదివారం నిర్వహించే ఈ శిక్షణ తరగతులు 40 సెలవు దినాలతో వచ్చే ఏడాది జూన్ వరకు కొనసాగుతాయని చెప్పారు. స్మార్ట్ ఫోన్ కలిగిన 25 నుంచి 40 ఏళ్లు ఉండి, డిగ్రీ, తత్సమాన పరీక్షలో ఉత్తీర్ణులైన వారు అర్హులని తెలిపారు. శిక్షణ ఉచితంగా ఇస్తారని, హోమియో పుస్తకాల కోసం రూ.1,500 ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు.